ఆరు దాటక ముందే శేఠ్ ధనరాజ్‌గారింట్లో హడావుడి ప్రారంభమైంది. మెయిన్ హాల్లో కాలుగాలిన పిల్లిలా ఇటూ అటూ పచార్లు చేస్తున్నాడు ధనరాజ్. వీధి గుమ్మంలో నిల్చుని వస్తున్న పాల బిందెల్లో నీళ్ళు కలిపి తెస్తున్నారని చిర్రుబుర్రులాడుతోంది భాగ్యశ్రీ.

ఏడు గంటలలోపే ఎలాగైనా. 'అభిషేకం' జరిగిపోవాలి. అది కాస్తా పూర్తయితే ఎనిమిదిన్నర కల్లా వస్తానన్న రంగాపురం మాజీ జమీందార్‌తో వ్యాపారం మాట్లాడుకోవాలి. అందుకే ధనరాజ్‌లో ఆ ఆందోళన ...

ప్రతి ఏడాది అదే రోజు తమ యిష్టదైవం గుడిలో విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పాలతోనే స్వహస్తాలతో గుడిని కడిగి ప్రక్షాళన చేయడం ఆ ఇంటి ఆచారం...

ఆఖరి బిందెతో రావలసిన రెండొందల లీటర్ల పాలు చేరడంతో సంతృప్తిగా నిట్టూర్చి, పూజ సామగ్రి తేవడానికి లోనికి పోయారు భార్యాభర్తలిద్దరూ ... ధనరాజ్ తన కాష్ బీరువా ముందు భక్తితో లెంపలేసుకుంటుంటే, ఇటు భాగ్యశ్రీ అద్దంలో తన మేకప్‌కి మరోసారి మెరుగులు దిద్దుకుంటోంది. మరో అర గంటకి గాని తెములలేకపోయారిద్దరూ.

ఇక బయల్దేరడానికి బైటకి వచ్చేసరికి, ఇంటెదురుగా జనం ... అంత తక్కువ వ్యవధిలో ఎలా వచ్చారో, అంత మందెలా రాగలిగారో తెలీదు ... దేశ ప్రగతికి పడ్డ గండ్లలా, ఆర్థిక వ్యవస్థ చిరుగుల్లా, ఎలకలు కొట్టేసిన మురికి జండా గుడ్డల్లా, ఎముకలకి తోలు చుట్టేసినట్టు ఒకరి మీద ఒకరు పడి తోసుకు వచ్చేస్తున్నారు దాదాపు ఏడాది నుండి పదిహేనేళ్ళ మధ్య వయసు పిల్లలు. అందరి కళ్ళల్లో ఆశా మెరుపులు ... వారి ఎండిన డొక్కల్లో రగులుతున్న క్రాంతి విరుపులు ... బిందెల్లో పాలని వారి బొచ్చెల్లోకి వంచుతున్నాడు చైతన్య. ఆబగా, ఆర్తిగా నేలరాలిన పాల చుక్కల్ని కూడా వదలకుండా



# అభిషేకం

— పి.వి.నరసింహదాసు

నాకేస్తున్నారు వారంతా. తిండి మొహం ఎరిగి ఎన్నాళ్ళయిందో ... ఆ సమయంలో వారికి పచ్చి పాలలో కూడా రుచే తెలుస్తోంది.

"రేయ్..." ప్రళయ భీకర స్వరంతో తండ్రి చేసిన సింహగర్జనకు తపో భంగమైన మహర్షిలా తల తిప్పి చూసిన చైతన్య, ఆ కళ్ళల్లో ఎరుపుకి గజగజ వణికిపోయాడు.

"ఎంత అపచారం చేశావురా! అభిషేకం కోసం తెచ్చిన పాలను దారినపోయే ముష్టి వెధవలకి దానం చేసి ఆచారాన్ని మంటగలిపావ్. ఎలా పుట్టింది నీకీ బుద్ధి...?" రుద్రుడిలా కొడుకు చెంపలు వాయించేస్తున్నాడు ధనరాజ్ ...

చైతన్య చిన్న గుండెల్లో ఎంతో ఆవేదన ... ఎంతెంతో చెప్పాలని వుంది... మాట గొంతు దాడటం లేదు... ఎలాగో నోరు విప్పగలిగాడు.

"డాడీ ... మరి అభిషేకం చేస్తే ఈ పాలన్నీ దేవుడు తాగుతాడా డాడీ? విగ్రహాన్ని కడిగి, గర్భగుడి కడిగి వేస్ట్ చేసే బదులు, దానిని అవసరమైన వారికి ఇస్తే పుణ్యం రాదా? 'మానవ సేవే మాధవసేవ'ని మా క్లాస్ పుస్తకాల్లో రాసి వుంది ... అదీగాక గుక్కెడుపాలు కూడా దొరకక ప్రతి ఏడూ ఎందరో పిల్లలు, పోషకాహార లోపం వల్ల వ్యాధులకి గురవుతున్నారని మా మాష్టారు చెప్పారు ... అందుకే ... ఉదయాన్నే పోయి వూరు చివర వుంటున్న ఈ పిల్లలందర్నీ కూడగట్టా ..."

ఆ చిన్ని హృదయంలో రగులుతున్న ఆవేదనకి, ఆర్ద్రతకి ఏ మాత్రం మానవత్వం వున్న మనిషైనా మోకరిల్లి ప్రణమిల్లక తప్పదు ... కానీ ధనరాజ్ డబ్బులో పుట్టిన మనిషి ... డబ్బుకోసం బ్రతుకుతున్న మనిషి ... కొడుకు నర్థం చేసుకోలేని మనిషి ...

కొద్ది లేటుగా అయినా ఆచారం యధావిధిగా కొనసాగింది.

